రియల్.. ఢమాల్

- పొదలకూరులో నిలిచిన వ్యాపారం
- క్రయ, విక్రయాలు అంతంతమాత్రమే..
- పడిపోతున్న రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం

పొదలకూరు చుట్టుపక్కల మండలాలకు సెంటర్ కావడంతో ఇక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారం మూడు పువ్వులు, ఆరుకాయలుగా కొనసాగింది. ప్రస్తుతం ప్లాట్లు అడిగే వారు లేకుండాపోయారు. ఇక్కడ వేసిన లేఅవుట్ల రికార్డులు సక్రమంగా లేకపోవడం, లిటికేషన్ ఉండటం వంటి కారణాలతో కూడా కొందరు స్థలాలు కొనడం మానుకున్నారనే ప్రచారం ఉంది.

పొదలకూరు: పది సంవత్సరాల క్రితం నెల్లూరు, బుచ్చిరెడ్డిపాళెం తదితర నగరాలతో పొదలకూరులో రియల్ వ్యాపారం పోటీపడింది. ఇప్పుడు ఆశించిన స్థాయిలో లేదని బ్రోకర్లు సైతం చెబుతున్నారు. ఈ ప్రాంతంలో వేసిన లేఅవుట్లకు చాలా వరకూ పంచాయతీ, నుడా అప్రూవల్స్ కూడా లేకపోవడం వల్ల వ్యాపారం మందగించినట్లుగా తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో సైతం వేలం వెర్రిగా లేఅవుట్లను నిర్మించి సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో పక్కనున్న కాలువలు, ప్రభుత్వ భూములను సైతం ఆక్రమించారు. దీంతో అధికారులు ఇటీవల లేఅవుట్లపై సమగ్ర విచారణ కూడా నిర్వహించారు. ప్లాట్ల క్రయ, విక్రయాలు గణనీయంగా తగ్గిపోవడంతో రిజిస్ట్రేషన్లు తగ్గి ప్రభుత్వ ఆదాయంపై ప్రభావం పడింది. పొదలకూరు పట్టణం, చుట్టుపక్కల ప్రాంతాల్లో సుమారు 69 లేఅవుట్లకు వరకు ఉన్నాయి. వీటిలో అనేకవాటిని సక్రమైన అనుమతులు లేకుండానే నిర్మించారు.

అనుమతి లేక..

లేఅవుట్లకు నిబంధనలు కచ్చితంగా పాటించాలి.


లేఅవుట్‌లో మొలిచిన పిచ్చిమొక్కలు

అయితే ఇక్కడ మొత్తం సుమారు 69 లేఅవుట్లను 317 ఎకరాల్లో వేశారు. అనుమతి సక్రమంగా లేకపోవడంతో ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.17 కోట్ల వరకు నష్టం వాటిల్లినట్లుగా తెలుస్తోంది. దశాబ్దన్నర కాలంగా ఇక్కడ రూ.కోట్లు సంపాదించారు. పట్టణానికి శివారుగా ఉన్న పొలాలను లేఅవుట్లుగా మార్చి చుట్టుపక్కల మండలాలకు చెందిన వారే కాక నెల్లూరు నగరానికి చెందిన వారు కూడా ఇక్కడ ప్లాట్లు కొనుగోలు చేశారు. నిర్మించిన లేఅవుట్లలో కొందరు డీటీసీపీ అనుమతులు తీసుకోకుండానే క్రయ, విక్రయాలు చేశారు. కనీస వసతులను సైతం కల్పించకుండా సొమ్ము చేసుకున్నారు. ఇటీవల నుడా అనుమతి లేని వాటిని గుర్తించి హెచ్చరిక బోర్డులను సైతం పెట్టించారు. అలాంటి లేఅవుట్లకు సంబంధించి ఎలాంటి రిజిస్ట్రేషన్లు చేయొద్దని సంబంధిత శాఖ అధికారులకు సర్వే నంబర్లను కూడా అందజేశారు. ఈ నేపథ్యంలో కొందరు రియల్టర్లు తమ లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోగా చాలా మంది పాతపద్ధతిలోనే అమ్ముకుని వెళ్లిపోయారు. కొత్తగా సంగం, నెల్లూరు, మనుబోలు మార్గాల్లో లేఅవుట్లను నిర్మించారు. ఇక్కడ వ్యాపారం సక్రమంగా లేదని బ్రోకర్లు చెప్పుకొస్తున్నారు. దీంతో లేఅవుట్లు నిర్మించి వారు నష్టపోతున్నట్టుగా తెలుస్తోంది. గత ప్రభుత్వంలో రియల్ రంగం వేగం పుంచుకుని నెల్లూరు నగరానికి చెందిన రియల్టర్లు కూడా వచ్చి వ్యాపారం సాగించారు.

గణనీయంగా తగ్గిన వ్యాపారం

రాష్ట్ర వ్యాప్తంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం దెబ్బతిన్నట్టు ప్రచారం ఉంది. పొదలకూరులో గణనీయంగా తగ్గినట్టు రిజిస్ట్రేషన్ శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. గతంలో రిజిస్ట్రేషన్లు బాగా జరిగి ప్రభుత్వానికి ఆదాయం పెరిగింది. పొదలకూరు రిజిస్ట్రేషన్ కార్యాలయం పరిధిలో పొదలకూరు మండలంతోపాటు, చేజర్ల, కలువాయి, వెంకటాచలం మండలంలోని ఒక గ్రామం ఉంది. మొత్తంగా చూసుకుంటే 77 రెవెన్యూ విలేజ్‌లు ఇక్కడి రిజిస్ట్రేషన్ కార్యాలయం పరిధిలోకి వస్తున్నాయి. గత మార్చి వరకు పరిశీలిస్తే అధికంగా ప్లాట్లు, ఇళ్లకు సంబంధించిన క్రయ, విక్రయాల రిజిస్ట్రేషన్లు 50 శాతం వరకు ఉన్నా అనుకున్న లక్ష్యాల మేరకు జరగలేదు. 2023 – 24లో 5,539 రిజిస్ట్రేషన్లు జరగ్గా రూ.11.67 కోట్లు రాబడి వచ్చింది. వాస్తవానికి ఆ ఏడాది నిర్దేశించిన లక్ష్యం రూ.11.10 కోట్లు కాగా అదనంగా జరిగాయి. 2024 – 25లో 4,383 రిజిస్ట్రేషన్లు జరగ్గా రూ.8.59 కోట్ల రాబడి వచ్చింది. అయితే నిర్దేశించిన లక్ష్యం మాత్రం రూ.17.18 కోట్లు. దీనిని బట్టి పరిశీలిస్తే రియల్ రంగం కుదేలైందని చెప్పొచ్చు. పొదలకూరు రిజిస్ట్రేషన్ కార్యాలయం ద్వారా రాబడి బాగా పెరిగేది రియల్ రంగం ద్వారానేనని అధికారులు వెల్లడిస్తున్నారు.


రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయం

క్లుప్తంగా

మలేరియాపై అప్రమత్తత అవసరం


కొడవలూరులో అవగాహన ర్యాలీ

కొడవలూరు: మలేరియాపై అప్రమత్తత అవసరమని కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి రామకృష్ణ పేర్కొన్నారు. మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా కొడవలూరులో అవగాహన ర్యాలీ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, ఇంటి వద్ద మురికి నిల్వలు, చెత్తా చెదారాల్లేకుండా చూడాలని కోరారు. మలేరియాను అంతం చేయడమే లక్ష్యంగా ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. వైద్యాధికారి బాలచంద్రబాబు, ఎస్‌యూఓ నాగరాజు, సీహెచ్‌ఓ సోమశేఖర్, హెచ్ఎస్ రామ్మోహన్, హెచ్‌ఏ షఫీఉద్దీన్, ఎల్టీ మెర్సీ తదితరులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవంపై సమీక్ష


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 21న నిర్వహించాల్సిన కార్యక్రమాలపై సమీక్ష సమావేశాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు మంగళవారం జరిపారు. ఎంపీడీఓ నారాయణరెడ్డి, తహసీల్దార్ అంబటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు శిక్షణ



మనుబోలు: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు అమూల్య మాట్లాడుతూ రోజూ యోగా చేయడం వల్ల జీవన ప్రమాణాలు మెరుగుపడుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బలరామయ్య, మల్లికార్జున, సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యం మృతి తీరనిలోటు

ఇందుకూరుపేట: గాంధీ ఆశ్రమ కమిటీ మాజీ సభ్యుడు రావిప్రోలు సుబ్రహ్మణ్యం మృతి తీరనిలోటని ఆశ్రమ కమిటీ కన్వీనర్ గణేశం కల్పనమ్మ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విశాఖపట్నంలో ఉంటున్న ఆయన అనారోగ్యంతో మృతి చెందారని చెప్పారు. ఆశ్రమ కో కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి తదితరులు సంతాపం తెలియజేశారు.

సదారావుకు ఘన సన్మానం



నెల్లూరు రూరల్: జిల్లాలో ఐ అండ్ పీఆర్ డిప్యూటీ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తించిన సదారావును నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో మంగళవారం సత్కరించారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్, జిల్లా ఉపాధ్యక్షులు దయాశంకర్, నాగరాజు, కోశాధికారి హనోక్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు.
- డీడీ సదారావుకు సిబ్బంది వీడ్కోలు పలికారు. నగరంలోని ఐ అండ్ పీఆర్ డీడీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన్ను సత్కరించారు.

మలేరియాను నిర్మూలిద్దాం

నెల్లూరు(అర్బన్): జిల్లాలో మలేరియా నిర్మూలనకు కృషి చేయాలని మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ కోరారు. మలేరియా మాసోత్సవాన్ని పురస్కరించుకొని పడారుపల్లి పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలో అవగాహన ర్యాలీని ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు తదితరులతో కలిసి మంగళవారం నిర్వహించారు. వ్యాధిపై అవగాహన కల్పించిన అనంతరం ఆమె మాట్లాడారు. చలి, జ్వరమొస్తే సమీపంలోని ప్రభుత్వాస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగితీగ చోరీ

పొదలకూరు: మండలంలోని ఆల్తుర్తి గ్రామ పొలాల్లో రెండు రోజుల క్రితం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైనట్టు రైతులు సోమవారం గుర్తించి విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందజేశారు. ఎస్సై హనీఫ్ కథనం మేరకు వివరాలు.. సుకుమార్ అనే రైతు పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ చోరీకు గురైంది. దొంగలు ట్రాన్స్‌ఫార్మర్ లోపల ఉన్న రాగి తీగలను తస్కరించారు. విద్యుత్ శాఖ వారి ఫిర్యాదు మేరకు ఎస్సై మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

తోటపల్లిగూడూరు: మండలంలోని పాత కోడూరు గ్రామంలో ఉన్న వృద్ధాశ్రమంలో మంగళవారం దాతలు అన్నదానం చేశారు. జై భారత్ నేషనల్ పార్టీ సర్వేపల్లి నియోజకవర్గ నాయకుడు కనగలూరు సురేంద్రబాబు జన్మదినం సందర్భంగా నాయకులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మద్దిలేటి శరత్‌బాబు, జానా కోటేశ్వరరావు, బెల్లం భాస్కర్, కడివేటి మస్తాన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌టవర్ నిర్మాణం అడ్డగింత

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని అంబేడ్కర్‌నగర్ ఏడో వీధిలో సెల్‌టవర్ నిర్మాణాన్ని స్థానికులు మంగళవారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇళ్ల మధ్యలో టవర్ నిర్మాణం సరికాదని, దీనిపై అధికారులకు ఇప్పటికే ఫిర్యాదు చేశామని తెలిపారు. చర్యలు చేపట్టకపోతే ఉద్యమిస్తామని పేర్కొన్నారు.

వీరాంజనేయస్వామికి వైభవంగా పూజలు


ప్రత్యేకాలంకరణలో వీర అభయాంజనేయస్వామి


మహిళల కోలాట ప్రదర్శన

- వేలాదిమంది భక్తులకు అన్నదానం
- ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన

పొదలకూరు: పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న శ్రీవీర అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం అత్యంత వైభవంగా పూజలను నిర్వహించారు. రెడ్డిజన సేవా సంఘం ఉభయకర్తలుగా వ్యవహరించింది. ఉదయం దేవస్థానంలో అభిషేకాలు, ఆకుపూజ, అష్టోత్తర పూజలను చేశారు. మధ్యాహ్నం వేలాది మంది భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామికి పల్లకి సేవ, ప్రత్యేక పూజలు జరిగాయి. పట్టణానికి చెందిన రెడ్డిజన సేవా సంఘం యువకులు హనుమాన్ చాలీసాను ఆలపించారు. రంగురంగుల విద్యుద్దీపాలంకరణలతో దేవస్థాన ప్రాంగణాన్ని అలంకరించారు. ఆంజనేయస్వామి ఎల్‌ఈడీ బొమ్మలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పాటలు, బాణసంచా, మంగళవాయిద్యాలు, మహిళల కోలాటం నడుమ అత్యంత వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఇందులో వైఎస్సార్ కడప జిల్లా మైదుకూరుకు చెందిన కళాకారులు బృందావనం, కాంతార నృత్యాలతో అలరించారు.

చారిత్రక సాక్ష్యానికి బీటలు

- గుప్త నిధుల కోసం ఆగని తవ్వకాలు
- గతంలోనూ విలువైన పురాతన సంపద దోపిడీ
- తవ్వకాల వెనుక అటవీ శాఖ?
- రెండు రోజుల క్రితం తవ్వకాల ఆనవాళ్లు గుర్తింపు
- అయినా పెద్దగా పట్టించుకోని అటవీ అధికారులు

చారిత్రాత్మక కట్టడాలు, విలువైన సంపదకు సాక్ష్యంగా నిలుస్తున్న ఉదయగిరి దుర్గం బీటలు వారుతోంది. ప్రకృతి ప్రేమికులను అలరిస్తూ.. పురావస్తు అధికారుల ప్రయోగ నిలయంగా ఉన్న దుర్గం వైభవం రూపురేఖలు కోల్పోతోంది. ఇక్కడి కోటకు 500 ఏళ్ల చరిత్ర ఉంది. పల్లవులు, చోళులు, విజయనగర రాజులు, మహ్మదీయ వంశీయులు, ఆంగ్లేయుల పాలనా కేంద్రంగా గతంలో విరాజిల్లింది. ఈ నేపథ్యంలో కోటపై నిర్మించిన కట్టడాల కింద బంగారు నాణేలు ఉంటాయని ప్రజలు విశ్వసిస్తుంటారు. ఈ క్రమంలో కొన్నేళ్లుగా పురాతన కట్టడాలను గుప్త నిధుల కోసం గుల్ల చేస్తున్నారు.

ఉదయగిరి : ఉదయగిరి దుర్గంపై అనేక చారిత్రాత్మక కట్టడాలున్నాయి. అలనాటి రాచరిక పాలన అంతరించిన తర్వాత మహ్మదీయుల పాలనలో అనేక ప్రాచీన కట్టడాలు ధ్వంసమయ్యాయి. సంప్రదాయక కట్టడాలు నేలమట్టం చేసి మసీదులు, బురుజులుగా మార్చారు. ఈ క్రమంలో అప్పుడే విలువైన బంగారు ఆభరణాలు, వజ్రాలను స్వాహా చేశారు. తర్వాత వచ్చిన ఆంగ్లేయులు సంపద కోసం అన్వేషణ చేసి దోచుకున్నారనే ప్రచారం ఉంది. స్వతంత్ర భారతంలో కూడా గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిగాయి. ప్రస్తుతం కూడా జరుగుతూనే ఉన్నాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన తర్వాత గుప్త నిధుల కోసం తవ్వకాలు మరింత ముమ్మరం చేశారు. సెన్సార్ పరికరాలను ఉపయోగించి ప్రాచీన కట్టడాల అడుగు భాగంలో ఉన్న విలువైన సంపద గుర్తించి రాత్రివేళల్లో తవ్వకాలు సాగిస్తున్నారు.

ఇటీవల మరోసారి..

గత శుక్రవారం దుర్గంపై రాత్రి వేళల్లో విద్యుత్ కాంతులు కనిపించాయి. దీంతో ఉదయగిరి పట్టణవాసులు గుర్తించి అటవీ అధికారులకు సమాచారం అందించారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాల్సిన అధికారులు, సిబ్బంది సకాలంలో స్పందించలేదు. కనీసం ఆ తెల్లవారుజామున తర్వాత కూడా తెలుసుకునే ప్రయత్నం జరగలేదు. దీంతో మరోసారి స్థానికులు అటవీ శాఖకు చెందిన ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆదివారం ఇద్దరు బేస్ క్యాంపు సిబ్బందితో పాటు కొత్తపల్లి బీట్ ఎఫ్‌బీఓ దుర్గంపైకి వెళ్లి అక్కడ ఏమీ జరగలేదని మీడియాకు చెప్పారు. అయితే సోమవారం దుర్గంపై తవ్వకాల ఆనవాలు, పేలుడు సామగ్రి ఫొటోలు వెలుగులోకి వచ్చాయి. కానీ అంతకు ముందు రోజు దుర్గంపైకి వెళ్లిన సిబ్బందికి ఇవేమీ కనిపించలేదు. దీనిని బట్టి వీరు కేవలం నామమాత్ర తనిఖీలు చేశారనే విషయం అవగతమవుతోంది.

ఇలా వెలుగులోకి..

ఉదయగిరి దిలార్ బావి వీధికి చెందిన కొంతమంది యువకులు శుక్రవారం రాత్రి దుర్గంపైకి లైటింగ్ సామగ్రితో చేరుకుని అక్కడే విందు ఏర్పాటు చేసుకుని, విద్యుత్ వెలుగులతో ఎంజాయ్ చేశారు. ఈ క్రమంలో వారు రామ బుగ్గ, కరీమ్ బుగ్గ ప్రాంతంలో ఆ రాత్రి గుప్త నిధుల కోసం కొందరు వ్యక్తులు తవ్వకాలు సాగిస్తున్నట్లు గుర్తించారు. కానీ అక్కడకు వెళ్తే ప్రమాదం ఉండొచ్చని భావించి వెళ్లలేదు. వీరిని గమనించిన గుప్త నిధుల తవ్వకం దార్లు అక్కడి నుంచి వెళ్లిపోయారు. తెల్లవారుజాము తర్వాత యువకులు ఆ ప్రాంతానికి వెళ్లగా అక్కడ గుప్త నిధుల కోసం చేసిన తవ్వకాలు, అక్కడ వదిలేసిన పేలుడు సామగ్రి, విద్యుత్ వైర్లు, కొన్ని యంత్రాలను గమనించారు. ఈ విషయం తమ స్నేహితులకు ఫోన్ ద్వారా తెలుపగా, అన్నీ వదిలేసి గుట్టుచప్పుడు కాకుండా రావాలని సలహా ఇచ్చారు. ఈ క్రమంలో ఆ యువకుల్లో ఒకరు ఆ ఫొటోలను సోమవారం మీడియాకు చేరవేశారు. దీంతో విషయం వెలుగులోకి వచ్చింది.

సిబ్బంది పాత్రపై అనుమానాలు

ఉదయగిరి దుర్గం అంతా పడమర బీట్ పరిధిలో ఉంటుంది. ఇక్కడ నిత్యం తవ్వకాలు జరుగుతుంటాయి. ప్రత్యేక నిఘా పెట్టాల్సిన అటవీ శాఖ సిబ్బంది ఆ దిశగా అడుగులు వేయడం లేదు. ఏదైనా ఘటనలు వెలుగులోకి వచ్చినప్పుడు హడావుడి చేయడం.. తర్వాత షరా మామూలే. ఇక్కడ పనిచేస్తున్న దిగువ స్థాయి సిబ్బందికి, తవ్వకాల ముఠాలకు సంబంధాలున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ బీట్‌లో విధులు నిర్వహిస్తున్న ఎఫ్‌బీఓ సక్రమంగా విధులకు రాకపోయినా, దిగువ స్థానంలో ఉన్న ఓ వ్యక్తి అన్నింటినీ మ్యానేజ్ చేస్తున్నారనే విమర్శలున్నాయి. దీంతో దుర్గంపై పూర్తి పర్యవేక్షణ కొరవడింది. గత నెలలో దుర్గం సమీపంలో ఉన్న బండగానిపల్లి అటవీ ప్రాంతంలో గుప్తనిధుల తవ్వకాల ముఠాలో ఓ వ్యక్తిని సిబ్బందిని పట్టుకున్నారు. విచారణలో ముఠాకు చెందిన పలువురు కీలకమైన వ్యక్తుల పేర్లు వెల్లడించారని, ఈ విషయం బయటకు చెబితే మరికొన్ని కేసుల్లో ఇరికిస్తామని హెచ్చరించడంతో అతను మిన్నకుండిపోయినట్లు ప్రచారంలో ఉంది. కీలక సమాచారం ఆధారంగా ముఠా సభ్యులను అరెస్టు చేసే అవకాశం ఉన్నా ఎందుకు పట్టించుకోవడం లేదు అనేది ప్రశ్న. ఇప్పుడు దుర్గంపై జరుగుతున్న తవ్వకాల వెనుక అటవీ శాఖ సిబ్బంది పాత్ర ఉండొచ్చనే ప్రచారానికి ఇలాంటి ఘటనలు బలం చేకూరుస్తున్నాయి.

యువకుడిపై దాడి

పొదలకూరు: మండలంలోని సూరాయపాళెం గ్రామంలో మంగళవారం జరిగిన ఘర్షణలో యువకుడిపై దాడి జరిగి తీవ్ర గాయాలపాలయ్యాడు. ఎస్సై హనీఫ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన సీహెచ్ అనిల్ రెండు కుటుంబాల మధ్య గొడవ జరుగుతుండగా సర్ది చెప్పేందుకు వెళ్లాడు. ఈలోగా మనోహర్ అనే యువకుడు వెనుకమాటుగా వెళ్లి కర్రతో అనిల్‌ను కొట్టాడు. దీంతో తలకు తీవ్రగాయమైంది. దాడికి పాల్పడిన మనోహర్ పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు అద్దాల ధ్వంసం

నెల్లూరు సిటీ: కారును వెంబడించి.. అద్దాలను ఇద్దరు ద్విచక్ర వాహనదారులు ధ్వంసం చేశారంటూ నెల్లూరు రూరల్ పోలీసులకు బాధితులు మంగళవారం ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. నేలటూరుకు చెందిన అరుణ్‌కుమార్ తన భార్య ఆరోగ్యం బాగోలేకపోవడంతో నెల్లూరులోని హాస్పిటల్‌కు సోమవారం రాత్రి బయల్దేరారు. ఈ క్రమంలో ధనలక్ష్మీపురం వద్ద కారును నెల్లూరుకు చెందిన నితీష్, వర్ధన్ ఆపి వాగ్వాదానికి దిగి, ఆపై అద్దాలను ధ్వంసం చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పింఛనర్ల సర్వసభ్య సమావేశం రేపు

నెల్లూరు(బృందావనం): భక్తవత్సలనగర్‌లోని పెన్షనర్ల భవనంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సర్వసభ్య సమావేశాన్ని గురువారం సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించనున్నామని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్సెమ్ గౌస్, ఎస్వీఎస్ మూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి తప్పక హాజరుకావాలని కోరారు.

తూకాల్లో తేడాలను సహించం

సంగం: వ్యాపారులు తూకాల్లో తేడాలు వస్తే సహించేది లేదని లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ మెహిసిన్ హెచ్చరించారు. మండల కేంద్రమైన సంగంలో మంగళవారం ఆరు దుకాణాల్లో ఆయన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తూకాల్లో తేడాలు ఉన్న ఐదు దుకాణదారులపై రూ.25 వేల జరిమానా విధించారు. అనంతరం మాట్లాడుతూ వ్యాపారులు తూకాల్లో తేడా రాకుండా కాటా సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. కాగా అధికారుల తనిఖీల నేపథ్యంలో పలువురు దుకాణదారులు షాపులకు తాళాలు వేసి పరారయ్యారు.

వ్యక్తిపై కత్తితో దాడి

నెల్లూరు(క్రైమ్): బైక్ విషయమై మాట్లాడాలని పిలిచి వ్యక్తిపై సమీప బంధువు కత్తితో దాడి చేసిన ఘటన బాలాజీనగర్‌లోని మసీదు సెంటర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. మసీదు సెంటర్‌లో నివాసం ఉంటున్న షాకీర్, షాబీబ్ బంధువులు. పాత బైక్‌ల క్రయ, విక్రయాలను షాకీర్ చేస్తుంటారు. ఈ క్రమంలో బైక్ కొనుగోలు విషయమై మాట్లాడేందుకు గానూ మసీదు సెంటర్‌కు రావాలని షాకీర్‌ను కోరారు. అక్కడికెళ్లిన షాకీర్‌పై కత్తితో దాడి చేశారు. గమనించిన స్థానికులు అక్కడికి రావడంతో నిందితుడు పరారయ్యారు. గాయపడిన షాకీర్‌ను చికిత్స నిమిత్తం అపోలో హాస్పిటల్‌కు తరలించారు. సమాచారం అందుకున్న బాలాజీ నగర్ ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు.. హాస్పిటల్‌కు చేరుకొని బాధితుడి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కాగా ఘటనకు దారితీసిన పరిస్థితులు తెలియాల్సి ఉంది.

ప్రశ్నిస్తే.. ఎదురుదాడా..?


మాట్లాడుతున్న చలపతిరావు, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

కొడవలూరు: ప్రజల పక్షాన నిలిచి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే.. పచ్చ నేతలు ఎదురు దాడికి దిగడం సబబేనా అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావు ప్రశ్నించారు. నియోజకవర్గ పార్టీ నేతలతో కలిసి నార్తురాజుపాళెంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ప్రజల పక్షాన పోరాడే హక్కు ఉందని, ఇలాంటి వాటిని స్వాగతించి లోపాలను సవరించుకోవాల్సిన పాలకులు, హేయమైన భాషతో ఎదురుదాడి చేసేలా నేతలను ప్రోత్సహించడం ఎంతవరకు సమంజసమని స్థానిక ఎమ్మెల్యేను ప్రశ్నించారు. వెన్నుపోటు దినం కార్యక్రమానికి జనం భారీగా తరలిరావడాన్ని ఓర్వలేక.. మాజీ మంత్రి, ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ప్రసన్నకుమార్‌రెడ్డి నాలుక కోస్తాం, అంతుచూస్తామంటూ పచ్చ నేతలు రెచ్చిపోవడం దారుణమన్నారు. తమ పార్టీ ఆందోళనలు చేపట్టి ప్రతిపక్ష బాధ్యతను పోషిస్తోందే తప్ప ఎవరిపైనా దూషణలకు దిగడంలేదని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన ఏడాదికి తల్లికి వందనం పథకాన్ని అమలు చేశారంటే అది తమ పార్టీ పోరాట ఫలితమేనని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. తమ పార్టీని విమర్శించే వారిలో ఎవరైనా కనీసం వార్డు సభ్యుడిగానైనా ప్రజాక్షేత్రంలో గెలిచారాననని ప్రశ్నించారు. పచ్చ నేతల విపరీత పోకడలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. పథకాల ఆశ చూపి ఓట్లేయించుకొని.. వాటిని ఇవ్వకపోవడం వెన్నుపోటు కాదానని ప్రశ్నించారు. ఎంత బెదిరించినా భయపడేదిలేదని, ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు. చికెన్ వ్యర్థాల రవాణాను ఆపాలని.. ఎర్ర మట్టిని తోలొద్దని చెప్తున్నా, యథావిధిగా సాగిపోతున్నాయని, ఎదురుదాడి చేయించడాన్ని మాని వీటిని అరికట్టాలని ఎమ్మెల్యేకు హితవు పలికారు. కోవూరు షుగర్ ఫ్యాక్టరీ వద్ద ఇసుకను డంపింగ్ చేసి లారీల్లో తరలిస్తున్నారని, ఇదెక్కడికెళ్తోందనే అంశాన్ని అడిగేవారే లేరన్నారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, జెడ్పీటీసీ శ్రీలత, ఎంపీపీ జ్యోతి, పార్టీ మండల కన్వీనర్లు శేషగిరి, శ్రీనివాసులురెడ్డి, అనూప్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, బుచ్చిరెడ్డిపాళెం నగరాధ్యక్షుడు షాహుల్, రాధాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు రీజియన్‌కు 300 ఎలక్ట్రిక్ బస్సులు

- ఆర్టీసీ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి


మాట్లాడుతున్న సురేష్‌రెడ్డి

పొదలకూరు: త్వరలో నెల్లూరు రీజియన్‌కు 300 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నట్టు ఆర్టీసీ రీజినల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. పొదలకూరు ఆర్టీసీ బస్టాండ్‌ను మంగళవారం సురేష్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొదలకూరు బస్టాండ్‌ను 15 ఏళ్లపాటు లీజుకు ఇచ్చినట్టు చెప్పారు. మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్ల రిపేర్లు, పెయింటింగ్స్ తదితర సౌకర్యాలను కల్పించడం జరుగుతుందన్నారు. బస్టాండ్ నిర్వహణకు, ఇతరులు ఇక్కడ ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించకుండా భద్రత కల్పిస్తామన్నారు. స్థానికులు సురేష్‌రెడ్డిని కలిసి పొదలకూరు నుంచి చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌లకు ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలని, తెల్లవారుజామున 4 నుంచి 6 గంటల్లోగా జిల్లా కేంద్రం నెల్లూరుకు బస్సుల్లేవని, సర్వీసులను నడపాలని విజ్ఞప్తి చేశారు. చైర్మన్ వెంట రాపూరు డీఎం అనిల్‌కుమార్ ఉన్నారు.

సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు


ఇందుకూరుపేట: పొలం పిలుస్తోంది కార్యక్రమానికి హాజరైన అధికారులు


కొడవలూరు: రామన్నపాళెంలో..

ఇందుకూరుపేట: వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా సబ్సిడీపై పరికరాలను రైతులకు అందజేయనున్నామని జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి పేర్కొన్నారు. మండలంలోని ఇందుకూరుపేటలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతుల నివేదికలను గ్రామ రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని వివరించారు. తమ పేర్లను సరిచూసుకోవాలని సూచించారు. ఏడీఏ నర్సోజీరావు, ఏడీఏ సుమలత, ఎంఏఓ రఘునాథ్‌రెడ్డి, జగదేవిపేట వెటర్నరీ డాక్టర్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

- కొడవలూరు: వరిసాగులో యాజమాన్య పద్ధతులు ప్రధానమని ఏఓ విజయలక్ష్మి సూచించారు. మండలంలోని ఆలూరుపాడు, రామన్నపాళెంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వినియోగించాలని సూచించారు. ఆకు నల్లిని నివారించుకోవాలని కోరారు. అన్నదాత సుఖీభవకు అర్హులైన రైతులు ఈ–కేవైసీని విధిగా చేయించుకోవాలని సూచించారు. జేవీఓ అరుణజ్యోతి, ఏఈఓ వెంకట్రావు, వీఆర్వో రమేష్, వీఏఏలు పృథ్వి, నిహారిక పాల్గొన్నారు.